అభ్యర్థులు ఎన్నికల ఖర్చును తనిఖీ చేయించుకోవాలి: ఆర్‌ఓ

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ ఎన్నికల కమిషన్ నియమాల ప్రకారం తమ ఎన్నికల ఖర్చును కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులతో తనిఖీ చేయించుకోవాలని ఆర్‌ఓ కె.వెంకట ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ తేదీ కంటే ముందు కనీసం మూడుసార్లు ఈ తనిఖీలు చేయించుకోవాలని అన్నారు. ఈనెల 18, 23, 28 తేదీల్లో రిటరి ్నంగ్ అధికారి కార్యాలయం ఆవరణలో ఉన్న సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకుల కార్యాలయంలో అభ్యర్థులు స్వయంగా లేదా.. వారు ధ్రువీకరించిన ఏజెంట్ ద్వారా గానీ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల లోపు తనిఖీలు చేయించుకోవాలన్నారు.

మజ్లిస్ అభ్యర్థికి క్రైస్తవ సంఘాల మద్దతు

మలక్‌పేట: మజ్లిస్ పార్టీ మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థి అహ్మద్ బలాలాకు మలక్‌పేట క్రైస్తవ సంఘాలు మద్దతు ప్రకటించాయి. మలక్‌పేట క్రైస్తవులకు శ్మశాన వాటిక స్థలాల కేటాయింపుపై అసెంబ్లీలో తన గళం వినిపించిన బలాలకు క్రైస్తవులు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్టు దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ బోడ సామ్యూల్ తెలిపారు. మలక్‌పేట క్రిస్టియన్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి డాక్టర్ గుత్తి సాల్మన్‌రాజ్ ఆధ్వర్యంలో గురువారం అక్బర్‌బాగ్ స్టాన్లీ గర్ల్స్ హైస్కూల్లో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్ల కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 23, వంకాయ 13, బెండ 35, పచ్చిమిర్చి 35, కాకర 23, బీర 23, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 60, క్యారెట్ 40, దొండ 18–19, చిక్కుడు 35–55.

ఎల్‌బీనగర్‌లో త్రిముఖ పోటీ

- ఇతర పార్టీల నుంచి నాయకులను చేర్చుకుంటూ బలం పెంచుకునే యత్నాలు
- సమావేశాలు, సమ్మేళనాలతో మద్దతు కూడగట్టుకుంటున్న అభ్యర్థులు

ప్రధాన పార్టీ అభ్యర్థుల మధ్యే పోరు



ఎల్‌బీనగర్: విద్యావంతులకు నిలయం.. పోరాటాల గడ్డ ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొంది. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరికి వారే తమతమ వ్యూహాలతో ఎన్నికల బరిలో ఉన్నారు. అంతా ఎవరికి వారే గెలుపు బావుటా ఎగురవేస్తామనే ధీమాలో ఉన్నారు. ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలను చేర్చుకుంటూ బలం పెంచుకొంటున్నారు. నియోజకవర్గ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో సమావేశాలు, సమ్మేళనాలు నిర్వహిస్తూ కాలనీ సంక్షేమ సంఘాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. తమ అనుచరులతో కలిసి ప్రచారం చేస్తూ..., మరోవైపు ఓటు బ్యాంకు ఉన్న వ్యక్తులతో మంతనాలు జరుపుతూ వారిని తమ వైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడ ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్ నుంచి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీజేపీ నుంచి సామ రంగారెడ్డి, కాంగ్రెస్ నుంచి మధుయాష్కీ గౌడ్ పోటీలో ఉన్నారు. సుధీర్‌రెడ్డి ఎల్‌బీనగర్ నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా, ఒకసారి ఓటమిపాలయ్యారు. సామ రంగారెడ్డి ఒకసారి ఎల్బీనగర్ నుంచి ప్రజారాజ్యం పార్టీ తరఫున, గత ఎన్నికల్లో టీడీపీ తరఫున ఇబ్రహీంపట్నం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఇక మధుయాష్కీ గౌడ్ రెండుసార్లు నిజామాబాద్ ఎంపీగా ఎన్నిక కాగా, ఒకసారి అక్కడ నుంచి పోటీ చేసి పరాజయం పాలయ్యారు.

తాము చేసిన అభివృద్ధిని తెలియజేస్తూ బీఆర్‌ఎస్ అభ్యర్థి..

దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి 2009, 2014లో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి రెండుసార్లు గెలుపొందారు. తర్వాత రాజకీయాల్లో వచ్చిన మార్పుల నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ చేరారు. ఈసారి బీఆర్‌ఎస్ నుంచి బరిలో ఉన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఎల్‌బీనగర్‌లో చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి ఈసారి కూడా విజయం సాధించాలని చూస్తున్నారు. తన హయాంలో జరిగిన అభివృవృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ తనను మరోసారి ఆశీర్వదించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. మరో వైపు ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పిస్తూ ఇతర పార్టీల నుంచి కార్యకర్తలను చేర్చుకుంటూ తన బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తూ ఓటర్ల ముందుకు వెళ్తున్నారు.

మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ బీజేపీ అభ్యర్థి..

బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి ఓటర్లకు వివరిస్తూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు. తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పింది బీజేపీ యేనని చెప్తూ బీసీ ఓటర్లకు గాలం వేస్తున్నారు. కేంద్రం చేసిన సంక్షేమ పథకాలను తెలియజేయడంతో పాటు బీఆర్‌ఎస్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపిస్తున్నారు. సామ రంగారెడ్డి ఎన్నికలకు ముందు నుంచే నియోజకవర్గంలో పాదయాత్రలు, నిరసన కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువయ్యారు. డివిజన్లలో బీజేపీ కార్పొరేటర్లు ఉండటం ఆ పార్టీ అభ్యర్థికి కలిసొచ్చే అంశంగా ఉంది.

ఆరు గ్యారంటీలను వివరిస్తూ కాంగ్రెస్ అభ్యర్థి..

కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న మధుయాష్కీ గౌడ్ రెండు పర్యాయాలు నిజామాబాద్ ఎంపీగా పని చేశారు. ఆయన ఈసారి ఎల్‌బీనగర్ అసెంబ్లీ బరిలో నిల్చున్నారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీముల గురించి ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో బలమైన బీసీ ఓటు బ్యాంకు ఉండటంతో బీసీలు తమ వైపే ఉన్నారనే ధీమాలో ఉన్నారు. ఎల్‌బీనగర్‌కు కొత్త కావడంతో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లపైనే ఆధారపడుతున్నారు. జాతీయ నాయకుడు కావడం, ఉద్యమంలో పనిచేసిన వ్యక్తులతో సంబంధాలు ఉండటంతో పలువురు మధుయాష్కీ గౌడ్‌కు అనుకూలంగా ప్రచారం చేస్తున్నారు. ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్ అడ్డాగా ఉన్నప్పటికీ కేడర్ లేకపోవడం కొంత ప్రతికూల అంశం.

జంగ్ 2023 తెలంగాణ

బలాలాను గెలిపించండి : అసదుద్దీన్ ఒవైసీ



ప్రచారంలో పాల్గొన్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, మజ్లిస్ అభ్యర్థి అహ్మద్ బలాల

మలక్‌పేట: పతంగి గుర్తుకు ఓటు వేసి మజ్లిస్ పార్టీ అభ్యర్థి అహ్మద్ బలాలాను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆపార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కోరారు. బలాలతో కలిసి గురువారం ఆయన అక్బర్‌బాగ్ డివిజన్‌లోని పలు కాలనీల్లో పాదయాత్ర చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, సలామ్ షాహీద్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే బడుగుల సంక్షేమం

మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి



బాలదానమ్మబస్తీలో ప్రచారం చేస్తున్న అజిత్‌రెడ్డి

మలక్‌పేట: బీఆర్‌ఎస్‌తోనే బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం దక్కుతుందని ఆ పార్టీ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. మూసారంబాగ్‌లో బాలదానమ్మబస్తీ, సలీంనగర్, శ్రీపురం కాలనీలలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ సునరితారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి తదితరు లు పాల్గొన్నారు. కాగా, కొంత కాలంగా పార్టీకి దూరంగా ఉంటున్న మాజీ డివిజన్ అధ్యక్షుడు ముప్పిడి ధన్వంత్ తన అనుచరులతో కలిసి అజిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ లో చేరారు.

మలక్‌పేటలో 'హస్తం' గాలి వీస్తోంది

కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్



ఎన్నికల ప్రచారంలో ఆటో నడుపుతున్న షేక్ అక్బర్

మలక్‌పేట: తెలంగాణలో కాంగ్రెస్ గాలి వీస్తోందని, మలక్‌పేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ఆ పార్టీ మలక్‌పేట అభ్యర్థి షేక్ అక్బర్ అన్నారు. మూసారంబాగ్ డివిజన్‌లో గురువారం బీడీ టెంపుల్, కృష్ణతులసినగర్, రామాలయం, బ్యాండ్ బస్తీ, తీగలగూడ, సాయినగర్ కాలనీలలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ అమలు, అభివృద్ధి కోసం హస్తం గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సీనియర్ నేత మండడి విజయసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్‌గౌడ్, బోనగిరి చంద్రశేఖర్, రవీందర్‌యాదవ్, సంగిరెడ్డి, సురేందర్‌రెడ్డి, సోహెల్ పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సుకు పాటుపడతా

బీజేపీ మలక్‌పేట అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి



ప్రచారంలో భాగంగా టిఫిన్ సెంటర్ దోశ వేస్తున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: పేదల పక్షాన నిలబడి వారి శ్రేయస్సు కోసం పాటుపడతానని బీజేపీ మలక్‌పేట అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. అక్బర్‌బాగ్‌లో డివిజన్ అధ్యక్షుడు నరేష్ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్నిక ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి బీజేపీకి మద్దతుగా నిలిచి తనను గెలిపించాలని కోరారు. పల్టాన్, దయానంద్‌నగర్, ఆనంద్‌నగర్‌ల్లో సురేందర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. కన్వీనర్ నవీన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే పాతబస్తీ అభివృద్ధి సాధ్యం

బీజేపీ యాకుత్‌పురా అభ్యర్థి వీరేంద్రబాబు యాదవ్



ఐఎస్‌సదన్‌లో ప్రచారం చేస్తున్న వీరేంద్రబాబు యాదవ్

సైదాబాద్: పాతబస్తీ సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ యాకుత్‌పురా నియోజకవర్గ అభ్యర్థి వీరేంద్రబాబు యాదవ్ అన్నారు. గురువారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఐఎస్‌సదన్ డివిజన్‌లోని పలు కాలనీల్లో పాదయాత్ర చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యాకుత్‌పురా ప్రజలు ఈసారి ఎన్నికల్లో బీజేపీని ఆదరించి తనకు అవకాశం కల్పిస్తే నియోజకవర్గంలో పేరుకుపోయిన సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రచారంలో ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, బీజేపీ నాయకులు సహదేవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గులాబీ జెండా ఎగురవేస్తాం



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారితో సుధీర్‌రెడ్డి

బీఆర్‌ఎస్ ఎల్బీనగర్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీనగర్‌లో భారీ మెజారిటీతో గులాబీ జెండాను ఎగురవేసి ఘన విజయాన్ని కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్‌లోని జనార్ధన్‌రెడ్డి, భూపేష్‌గుప్తానగర్, ఆదర్శనగర్, వాంబే నగర్, నందనవనం, ఇంద్రసేనారెడ్డి, దేవీనగర్ తదితర కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుపై ఓటు వేసి మరోమారు తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, సంక్షేమ సంఘ ప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై తీన్‌మార్ డప్పులు, డ్యాన్స్‌లు, మంగళహారతులతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, మరోసారి తనను ఆశీర్వదించి ఘన విజయం అందిస్తే ఐదేళ్ల పాటు సేవకుడిగా ఉండి ఎల్‌బీనగర్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని, అందువల్లే రాష్ట్రంలో అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉంటున్నాయని అన్నారు. ఇప్పటి కరకు ఎల్‌బీనగర్‌ను కొన్ని వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేశానని, ఇంకా చిన్నపాటి సమస్యలు ఉన్నాయని వాటిని కూడా ఎన్నికల అనంతరం పూర్తి చేస్తానన్నారు. ఎల్‌బీనగర్‌లోని ఏ గల్లీ ఎక్కడుందో తెలియని ఇతర పార్టీల అభ్యర్థులు కపట ప్రాంతీయ అభిమానాన్ని ప్రదర్శిస్తూ కల్లబొల్లి మాటలతో ఓటర్లను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారని, వారి ఎత్తులను చిత్తు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పద్మాశ్రీనివాస్ నాయక్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు సత్యంచారి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, శివారెడ్డి, అనిత, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



హస్తినాపురం డివిజన్ జనార్ధన్‌రెడ్డి కాలనీలో ఓటు అభ్యర్థిస్తున్న సుధీర్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌లో చేరికలు

ఎల్‌బీనగర్ నియోజకవర్గ వైఎస్‌ఆర్‌టీపీ సమన్వయకర్త మామిడి రామచందర్‌తో పాటు ఆయన అనుచరులు 60 మంది ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో ఎల్‌బీనగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రమావత్ రవి, భరత్‌కుమార్, వెంకటేష్, యాదగిరి, శ్రీకాంత్ యాదవ్, నాగన్న, రాజు ఉన్నారు.

ఓటమి భయంతో కాంగ్రెస్ చిల్లర రాజకీయాలు: సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: ఓటమి భయంతో కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఎల్‌బీనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల సంఘంలో ఆధ్వర్యంలో పని చేసే ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తే తనకు ఏం సంబంధం ఉంటుందని, ఎన్నికల అధికారులు ఇప్పటికి తన వాహనాలను మూడుసార్లు తనిఖీ చేశారని, వారికి తాను పూర్తిగా సహకరించానని అన్నారు. ఓటమి భయంతో ఎన్నికల అధికారుల నిర్వహించిన తనిఖీలను తనపై రుద్దాలని చూస్తున్నారని, ఇలాంటి రాజకీయాలు మానుకోవాలని సూచించారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ తన పేరుతో ఉన్న వ్యక్తిని ఎన్నికల్లో చేయిస్తోందని ఆరోపించారు. ఎన్ని జిమిక్కులు చేసిన ఎల్‌బీనగర్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయం ఖాయమని అన్నారు. బీఆర్‌ఎస్ సనియర్ నాయకులు ముద్దగౌని రాం మోహన్ గౌడ్ పాల్గొన్నారు.

మూడోసారీ కేసీఆరే ముఖ్యమంత్రి

యాకుత్‌పురా బీఆర్‌ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి



సామ సుందర్‌రెడ్డి మాస్క్ పెట్టుకొని ఆయనతో కలిసి ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

సైదాబాద్: తెలంగాణ ప్రజల ఆదరాభిమానాలతో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొంది ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని యాకుత్‌పురా బీఆర్‌ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఐఎస్‌సదన్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐఎస్‌సదన్‌లోని సింగరేణి కాలనీ, మీటర్ సీల్ ఆఫీస్ చౌరస్తా, సరస్వతీనగర్ తదితర కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో పలువురు నాయకులు వినూత్నంగా అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి మాస్కులు ధరించి సందడి చేశారు.

రూ.100 కోట్లతో మహేశ్వరం అభివృద్ధి

బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి



మహేశ్వరం: ప్రచారంలో పాల్గొన్న సబితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరంలో మరోమారు తానే ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని మంత్రి సబితారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. దాదాపు రూ.100 కోట్ల నిధులతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనేక పరిశ్రమలను తీసుకువచ్చి స్థానిక యువతకు ఉద్యోగాలు ఇప్పించామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు నర్సింహ, బీఆర్‌ఎస్ నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, కార్యదర్శి అంజయ్య, మండల అధ్యక్షుడు రాజునాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ కొడుతున్నాం

తుక్కుగూడ: బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మంత్రి సబితారెడ్డి అన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలకి చెందిన సర్దార్ పటేల్ యువజన సంఘం సభ్యులు గురువారం మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. తనపై పోటీ చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు

ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి కల్వ సుజాత



మాట్లాడుతున్న కల్వ సుజాత, చిత్రంలో కాంగ్రెస్ మహేశ్వరం అభ్యర్థి కేఎల్లార్ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ హామీలను తప్పకుండా అమలు చేస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాత అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా ఆర్‌కేపురం డివిజన్, వాసవి కాలనీలోని ఆధ్యాత్మిక కేంద్రంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనానికి ఆమెతో పాటు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రతినెలా రూ. 2500, రూ. 400లకే గ్యాస్ సిలిండర్ తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. హస్తం గుర్తుపై ఓటు వేసి ప్రజలకు నిరంతరం సేవ చేసే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి మా ట్లాడుతూ, సేవ చేయాలనే తాను రాజకీయాల్లో వచ్చానని, తనను గెలిపించా లని కోరారు. కార్యక్రమంలో ఆర్‌కేపురం మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి పున్న నిర్మల గణేష్ నేత, మ్యాడం సుధాకర్ గుప్తా, వాసవి కాలనీ ప్రధాన కార్యదర్శి అయిత అంజయ, వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు ఏవూరి రాజ్యలక్ష్మి, ఆర్‌కే పురం మహిళ అధ్యక్షురాలు లక్ష్మీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'బంధు'లన్నీ ఎమ్మెల్యే అనుచరులకే..



శివగంగా కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న సామ రంగారెడ్డి

బీజేపీ ఎల్బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి

లింగోజిగూడ: ఎమ్మెల్యే అనుచరులకే బీసీ బంధు, దళిత బంధు పథకం మంజూరు చేసి ఇతరులకు మొండి చేయి చూపించారని ఎల్‌బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన కొత్తపేట డివిజన్‌లోని శివగంగా కాలనీలో స్థానిక కార్పొరేటర్ పవన్‌కుమార్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, 2018లో ప్రజలు ఎమ్మెల్యేగా సుధీర్‌రెడ్డిని గెలిపిస్తే అధికార పార్టీకి అమ్ముడుపోయారని అన్నారు. బీసీ, దళిత బంధులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి బంధువుగా మారాయని, మొదటి విడతలో తన అనుచరులకు తప్ప ఇతరులకు ఒక్కరికి కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. బంధులన్నీ చివరికి ఎమ్మెల్యే దుకాణాన్ని బంద్ చేస్తాయని అన్నారు. నియోజక వర్గంలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలంటే బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అభివృద్ధి పేరుతో తప్పుడు లెక్కలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పెంటా రెడ్డి, యోగెందర్‌రెడ్డి, శివచారి, కిరణ్‌గౌడ్, అంబాల మల్లేష్, రమేష్‌చారి, బీమ్‌రాజ్ పాల్గొన్నారు.

బీజేపీకి ప్రజల మద్దతు..

ఎల్‌బీనగర్‌లో కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమని, డబుల్ ఇంజిన్ సర్కారు కోసం ప్రజలు బీజేపీకి మద్దతు ఇస్తున్నారని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సామ రంగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో పాల్గొని ఓట్లు అభ్యర్థించారు. నాయకులు కొంతం నవకిషోర్‌రెడ్డి, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, రాజీరెడ్డి, రఘురాంనేత, శంకరయ్యగౌడ్, విష్ణువర్ధన్‌రావు, శరత్‌కుమార్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనతో ప్రజాస్వామ్యానికి సుస్తీ!

కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్



బీఎన్‌రెడ్డి నగర్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం/ చైతన్యపురి: బీఆర్‌ఎస్ పాలనతో ప్రజాస్వామ్యానికి సుస్తీ చేసిందని, దానిని ఓటు అనే మాత్రతో నయం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. గురువారం చైతన్యపురి డివిజన్‌లో యోగా శిక్షణ కేంద్రంలో అవినాష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మన ఆరోగ్యం ఎంత ముఖ్యమో మన నియోజకవర్గం ఆరోగ్యంగా ఉండటం అంతే ముఖ్యమని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని యోగా శిక్షకులను కోరారు.

హయత్‌నగర్ డివిజన్‌లో...

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని మధుయాష్కీ అన్నారు. హయత్‌నగర్ డివిజన్ భాగ్యలత కాలనీలో ఎర్రగోళ్ల బాబుయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. నాయకులు వజీర్ ప్రకాష్‌గౌడ్, సుజాతరెడ్డి, గజ్జి శ్రీనివాస్, భాస్కర్, ప్రవీణ్, షేక్ పర్వేజ్, సామ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మన్సూరాబాద్ డివిజన్‌లో...

మన్సూరాబాద్ డివిజన్‌లో జరిగిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మధుయాష్కీ గౌడ్ పాల్గొన్నారు. అధికార పార్టీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా కాంగ్రెస్ సునామీలో కారు కొట్టుకుపోవడం ఖాయన్నారు. నాయకులు బుడ్డ సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, కృపాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో...

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో బుధవారం రాత్రి పలువురు న్యాయవాదులు, రిటైర్డు న్యాయమూర్తులు, వివిధ రంగాల నిపుణులు, ఉద్యోగులతో మధుయాష్కీ గౌడ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మధుయాష్కీగౌడ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ న్యాయపరంగా తోడుంటామని, అధికారులు ఎన్నికల కోడ్ నియమాలు పాటించాలని అన్నారు. నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మాల్యాద్రి, కరణ్, వెంకటేష్ యాదవ్, సుధాకర్‌గౌడ్, నిరంజన్, రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.